


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




గురువారం 15- 01- 2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక :220 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


## ఢిల్లీ బ్లాస్ట్ కేసులో కీలక పరిణామం




## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. రూపాయి విలువ మరింత పతనం!




## రైలుపై కుప్పకూలిన భారీ క్రేన్.. ఏకంగా 22 మంది దుర్మరణం




## మారణహోమం.. భారీ విధ్వంసంలో పెరిగిన మృతుల సంఖ్య




## వడ్డీల ఉరితాళ్ళకు తల్లి కొడుకుల బలి




## డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. 27 మందికి పైగా గాయాలు




సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని, మా పత్రిక కార్యాలయానికి నేడు సెలువు ఉంటుంది. ఈ కారణంగా రేపటి (తేదీ 16-01-2026) సంచిక వెలువడదు. తాజా సమాచారంతో, తదుపరి సంచికలో మిమ్మలి మళ్లీ కలుస్తాం.
-ఎడిటర్


# దక్షిణాదిలో చదువుకున్న అమ్మాయిలు.. ఉత్తరాదిలో బానిసలేనా?

## డీఎంకే ఎంపీ సంచలన వ్యాఖ్యలు

డీఎంకే ఎంపీ దయానిధి మారన్ చేసిన వ్యాఖ్యలు మరోసారి దేశవ్యాప్తంగా వివాదానికి తీశాయి. కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థులను ఇంగ్లీష్ చదవకుండా నిరుత్సాహపరుస్తూ, కేవలం హిందీ మాత్రమే చదవాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శలు చేశారు. అలాంటి విధానాల కారణంగానే ఆయా రాష్ట్రాల్లో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి.. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రజలు దక్షిణ భారతదేశానికి వలస రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. ఇక, మీరు ఇంగ్లీష్ చదవొద్దని చెబుతున్నారు.. చదివితే నాశనం అవుతారని భయపెడుతున్నారు.. ఇలా చేస్తే మిమ్మల్ని బానిసలుగా మార్చినట్టే అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.




కాగా, తమిళనాడులో విద్యకు ప్రాధాన్యం ఇవ్వడమే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన కారణమని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ స్పష్టం చేశారు. ఈరోజు ప్రపంచంలోని అగ్రశ్రేణి కంపెనీలు తమిళనాడుకు వస్తున్నాయంటే, అది ఇక్కడి విద్యావంతులైన యువత వల్లే అని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో హిందీకి మాత్రమే పరిమితమైన విద్యా విధానం నిరుద్యోగాన్ని పెంచుతోందని ఆరోపించారు. దీనికి భిన్నంగా, తమిళనాడులో అమలవుతున్న ద్రావిడ మోడల్ బాలికలు- బాలురు అనే తేడా లేకుండా అందరికీ సమాన విద్య అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. ఈ విధానాలతో రాష్ట్రంలో అక్షరాస్యత రేటు పెరగడమే కాకుండా, మహిళల ఉద్యోగ భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరిగిందని దయానిధి మారన్ వెల్లడించారు.




# తెలంగాణ పల్లెలకు కేంద్రం తీపి కబురు!

## రూ. 2,500 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్



- ➩15వ ఆర్థిక సంఘం కింద ఈ నెలలోనే రూ. 1,000 కోట్లు విడుదల
- ➩వచ్చే నెలలో మరో రూ. 1,500 కోట్లు మంజూరు
- ➩పంచాయతీ ఎన్నికలతో తొలగిన నిధుల ఆటంకాలు
- ➩సంక్రాంతి కానుకగా రాష్ట్రం నుంచి అదనంగా రూ. 277 కోట్లు
- ➩కొత్త సర్పంచులకు నిధుల పండగ.. గ్రామాల్లో అభివృద్ధి జోరు

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు విడుదల కానున్నాయి. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ముగిసి.. కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడంతో నిధుల విడుదలకు ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం కింద రావాల్సిన రూ. 2,500 కోట్ల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మిగతది 2 లో

## పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు మృతి




పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు మృతి.. వెల్గటూరు మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన బలాటి శివ (18)అనే యువకుడు గత నాలుగు రోజుల క్రితం పెట్రోలు పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి గాంధీ ఆసుపత్రిలో మృతి చెందారని బంధువులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శివకు చదువు సరిగా అబ్బక గ్రామంలో బేవార్స్‌గా తిరిగేవాడు. తరుచుగా డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు.

## ఐ-ప్యాక్ కార్యాలయాలపై ఈడీ దాడులు.. కలకత్తా హైకోర్టులో వాడివేడి వాదనలు




మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు ఇటీవల కలకత్తాలోని ఐపాక్ కార్యాలయంలో సోదాలు చేశారు. ఈ సమాచారం అందుకున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేరుగా వెళ్లి ఈడి అధికారులను అడ్డుకుంది. ఈ పరిణామం తీవ్ర చర్చకు దారితీసింది. ఆ సమయంలో ఈడీ అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించగా, తమ డేటా చోరీకి గురైందని టీఎంసీ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది.

# మీడియాపై దాడులు రేవంత్ పాలనకు నిదర్శనం

## ● జర్నలిస్టుల అరెస్టుపై కేటీఆర్ ఫైర్





రాష్ట్రంలో జర్నలిస్టుల అరెస్టుల్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోందని విమర్శించారు. నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. అర్ధరాత్రివేళ అరెస్టులు చేయడం సరికాదని, సీఎం రేవంత్ రెడ్డి పాలనలో మీడియాపై దమనకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సైతం ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ గారు.. మీరు నడుపుతోన్న మొహబ్బత్ కీ దుకాన్ తెలంగాణశాఖ పౌరుల రాజ్యాంగ హక్కుల్ని ఎలా కాలరాస్తుందో చూస్తున్నారని ఆశిస్తున్నాని ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు.

అర్ధరాత్రి అరెస్టులు చేయాల్సిన అవసరమేంటి?: "పండుగ సమయంలో ముగ్గురు జర్నలిస్టులను అరెస్ట్ చేయడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. తెలంగాణలో కాంగ్రెస్ పాలన ప్రతిసారి ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తోంది.

# ఇరాన్‌ను వెంటనే వీడండి

## భారతీయులకు కేంద్ర ప్రభుత్వం అత్యవసర హెచ్చరిక!

ఇరాన్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా భారత ప్రభుత్వం అప్రమత్తం అయింది. వివిధ కారణాలతో ఇరాన్ వెళ్లి.. అక్కడ ఉన్న భారతీయ పౌరులకు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, యాత్రికులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు అందుబాటులో ఉన్న విమానాలు, ఇతర రవాణా మార్గాల ద్వారా వెంటనే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. ఈ ఏడాది జనవరి 5న జారీ చేసిన ముందస్తు హెచ్చరికను కొనసాగిస్తూ, ప్రస్తుత పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారుతున్న నేపథ్యంలో ఈ తాజా ఆదేశాలు జారీ చేసింది.


EMBASSY OF INDIA
TEHRAN
ADVISORY




ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కోరింది. నిరసనలు, ఆందోళనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక వార్తలను నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించింది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
గురువారం 15-01-2026

# పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు మృతి

పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు మృతి.. వెల్గటూరు మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన బలాటి శివ (18)అనే యువకుడు గత నాలుగు రోజుల క్రితం పెట్రోలు పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి గాంధీ ఆసుపత్రిలో మృతి చెందారని బంధువులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శివకు చదువు సరిగా అబ్బక గ్రామంలో బేవార్స్‌గా తిరిగేవాడు. తరుచుగా డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. ఇదే క్రమంలో ఈ నెల 9న రూ.20 వేలు కావాలని తల్లిని అడిగాడు. ప్రస్తుతం తన దగ్గర డబ్బులు లేవని తల్లి తిరస్కరించింది. తను అడిగిన డబ్బులు తల్లి ఇవ్వలేదని మనస్తాపానికి గురైన శివ క్షణికావేశంలో ఇంటిలోకి వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో శివకు తీవ్రగాయాలు కావటంతో హుటాహుటిన అంబులెన్సులో జగిత్యాల ఆసుపత్రికి అక్కడి నుండి కరీంనగర్ తరలించారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే నాలుగు రోజులపాటు చికిత్స పొందుతూ శివ మృతి చెందాడు. ఇతడిపై గతంలో గంజాయి కేసు కూడా ఉన్నట్లు సమాచారం.

# ఐ-ప్యాక్ కార్యాలయాలపై ఈడీ దాడులు.. కలకత్తా హైకోర్టులో వాడివేడి వాదనలు


మొదటి పేజీ తరువాయి

కాగా ఈ దాడులకు సంబంధించి కలకత్తా హైకోర్టులో వాడివేడి వాదనలు నడిచాయి. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కు చెందిన ఐ-ప్యాక్ కార్యాలయం, దాని డైరెక్టర్ ప్రతీక్ జైన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్వహించిన సోదాలపై కలకత్తా హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్, ఐ-ప్యాక్ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ సువ్రా ఘోష్ ధర్మాసనం విచారిస్తోంది.

ఈడీ కీలక వ్యాఖ్యలు: విచారణ సందర్భంగా ఈడీ తరపు న్యాయవాదులు తమ వాదనలను బలంగా వినిపించారు. "మేము సోదాలు నిర్వహించింది ఒక చోట అయితే, సంబంధం లేని మరో పార్టీ వచ్చి 'మా డేటా వారితో ఉంది' అని ఆందోళన చెందడం ఆశ్చర్యంగా ఉంది. చట్టపరంగా ఇలాంటి వాదనలకు తావులేదు," అని ఈడీ పేర్కొంది. తాము కేవలం అవినీతి కేసులో ఆధారాల కోసమే సోదాలు చేశామని, ఇందులో రాజకీయ జోక్యం లేదని ఈ సందర్భంగా ఈడీ అధికారులు కోర్టులో స్పష్టం చేశారు.

టీఎంసీ, ఐ-ప్యాక్ అభ్యంతరం: మరోవైపు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని దొంగిలించడానికి కేంద్రం ఈడీని వాడుకుంటోందని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఐ-ప్యాక్ వద్ద ఉన్న తమ పార్టీ అంతర్గత సర్వేలు, వ్యూహాలను ఈడీ సీజ్ చేయడం వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడమేనని పిటిషనర్లు వాదించారు. కాగా ప్రస్తుతం కలకత్తా హైకోర్టులో ఈ వ్యవహారంపై వాదనలు కొనసాగుతున్నాయి.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. రూపాయి విలువ మరింత పతనం!




అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి, విదేశీ పెట్టుబడిదారుల విక్రయాల జోరుతో దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 245 పాయింట్లు నష్టపోయి 83,382 వద్ద స్థిరపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 42 పాయింట్ల స్వల్ప నష్టంతో 25,690 వద్ద ముగిసింది. ముఖ్యంగా ఐటీ, ఆటో రంగాల షేర్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి కనిపించగా, టీసీఎస్, మారుతీ సుజుకీ వంటి దిగ్గజ సంస్థల షేర్లు 2 శాతం మేర క్షీణించాయి. అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్ హెచ్చరికలు, పెరుగుతున్న ముడిచమురు ధరలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మరోవైపు, దేశీయ కరెన్సీ రూపాయి విలువ డాలర్‌తో పోల్చుకుంటే మరింత బలహీనపడి 90.29 వద్ద ఆల్-టైమ్ కనిష్ట స్థాయికి చేరువలో ముగిసింది. అయితే మార్కెట్ పతనంలోనూ మెటల్, పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగాలు మాత్రం రాణించాయి. వేదాంత షేరు సరికొత్త రికార్డు స్థాయిని తాకగా, సానుకూల త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు 8 శాతానికి పైగా లాభపడ్డాయి. ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం ధరలు కూడా మార్కెట్ అనిశ్చితి వల్ల గరిష్ట స్థాయిలో కొనసాగుతున్నాయి.

# బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశం లేదు.. టీవీకే నేత సంచలన వ్యాఖ్యలు

విజయ్ దళపతి పార్టీని ఎన్డీయేలోకి బలవంతంగా చేర్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగానే అతడు నటించిన 'జన నాయగన్' సినిమాకి సకాలంలో సెన్సార్ సర్టిఫికెట్ లభించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పొత్తుపై తమిళగ వెట్రి కళగం పార్టీ రియాక్ట్ అయింది. రాజకీయంగా తమను అడ్డుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎన్డీయేతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ క్లారిటీ ఇచ్చారు. టీవీకేను కూల్చడానికి ఎన్ని కుట్రలు చేసినా తమ పార్టీ సిద్ధాంత వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని వెల్లడించారు. టీవీకేకు బీజేపీ సిద్ధాంత శత్రువు అయితే డీఎంకే రాజకీయ శత్రువని పేర్కొన్నారు.

ఇక, 'జన నాయగన్' సినిమా వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందనను స్వాగతిస్తున్నట్లు టీవీకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ తెలిపారు. దీనిని తమ పార్టీకి కాంగ్రెస్ ఇస్తున్న స్నేహపూర్వక సపోర్టుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఆ పార్టీతో పొత్తు విషయంపై తమ పార్టీ అధినేత విజయ్ మాత్రమే నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. మరోవైపు కరూర్ తొక్కిసలాట దుర్ఘటన వ్యవహారం లోనూ విజయ్‌కు సీబీఐ మరోసారి సమన్లు జారీ చేయడంతో.. అతడ్ని ఇరకాటంలో పెట్టి పొత్తుకు ఒప్పించాలని బీజేపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

# దక్షిణాదిలో చదువుకున్న అమ్మాయిలు.. ఉత్తరాదిలో బానిసలేనా?.. డీఎంకే ఎంపీ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

అయితే, ఇంగ్లీష్ మీడియం చదవకపోతే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుంది, భాషపై ఆంక్షలు విధించడం అభివృద్ధి, ఉపాధికి అడ్డంకిగా మారుతుందని దయానిధి మారన్ వ్యాఖ్యానించారు. ఇక, ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. దయానిధి మారన్‌కు "బుద్ధి లేదని" విమర్శిస్తూ.. హిందీ మాట్లాడే ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నేత తిరుపతి నారాయణన్ డిమాండ్ చేశారు. హిందీ మాట్లాడేవారిని చదువులేని, సంస్కారం లేని వారిలా చిత్రీకరించడం దురదృష్టకరం అన్నారు.

ఇదిలా ఉంటే, దయానిధి మారన్ వ్యాఖ్యలకు డీఎంకే నేత టీకేఎస్ ఇళంగోవన్ మద్దతుగా నిలిచారు. ఉత్తర భారతదేశంలో మహిళల హక్కుల కోసం పోరాడేవారు తక్కువగా ఉన్నారని తెలిపారు. ఇది రాష్ట్రాన్ని పాలించే పార్టీపై ఆధారపడి ఉంటుంది.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మహిళల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారు.. తమిళనాడులో మేము మహిళల కోసం పోరాడి, వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాం.. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కూడా అమలు చేశాం.. ప్రారంభం నుంచే మహిళా హక్కుల కోసం పని చేస్తున్నామని ఇళంగోవన్ చెప్పుకొచ్చారు. ఎంపీ దయానిధి మారన్ వ్యాఖ్యలతో హిందీ-ఇంగ్లీష్, ఉత్తరం- దక్షిణం మధ్య విద్య, ఉపాధి అంశాలపై రాజకీయ వివాదం మరింత తీవ్రంగా కొనసాగుతుంది.

# ఢిల్లీ బ్లాస్ట్ కేసులో కీలక పరిణామం.. 3 రోజులు ఎన్ఐఏ కస్టడీకి డాక్టర్ షాహీనా

ఢిల్లీ బ్లాస్ట్ కేసులో నిందితురాలైన డాక్టర్ షాహీనాను మూడు రోజుల పాటు ఎన్ఐఏ కస్టడీకి ఢిల్లీ పాటియాలా కోర్టు అప్పగించింది. గత నవంబర్ 10న ఎర్రకోట సమీపంలో కారు బ్లాస్ట్ అయింది. ఈ ఘటనలో 13 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాది ఉమర్ కూడా హతమయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్న అధికారులు కీలక విషయాలు రాబట్టారు. హర్యానాలోని అల్-ఫలాహ యూనివర్సిటీ వేదికగా డాక్టర్ల బృందం దేశ వ్యాప్తంగా ఉగ్ర దాడులకు కుట్ర పన్నినట్లుగా తేల్చారు.

ఇందులో ముఖ్యంగా డాక్టర్లు షాహీనా, ముజమ్మిల్, ఉమర్ కీలక సూత్రధారులుగా ఉన్నారు. అయితే కుట్ర బయటపడడంతో ఉమర్ తప్పించుకునే ప్రయత్నంలో కారులో ఉన్న బాంబ్‌లు పేలిపోయాయి. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రస్తుతం డాక్టర్లు షాహీనా, ముజమ్మిల్ జైల్లో ఉన్నారు. తాజాగా షాహీనాను మూడు రోజుల పాటు ఎన్ఐఏ కస్టడీకి అప్పగించింది.

# మీడియాపై దాడులు రేవంత్ పాలనకు నిదర్శనం జర్నలిస్టుల అరెస్టుపై కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి



జర్నలిస్టులను నేరస్తుల్లా వ్యవహరించేందుకు తెలంగాణ డీజీపీ ఎంతగా పట్టుబడుతున్నారో చూడటం దురదృష్టకరం. వారికి నోటీసులు ఇచ్చి, విచారణకు పిలవవచ్చు కదా. అలా చేయకుండా, అర్ధరాత్రి జర్నలిస్టుల ఇళ్లలోకి వెళ్లి అరెస్టులు చేయడం అత్యుత్సాహం, హద్దులు దాటిన చర్య. అరెస్టు చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని నేను డిమాండ్ చేస్తున్నాను. ఈ కేసుల్లో నమోదు చేసిన సెక్షన్లలో ఏదీ నాన్-బెయిలబుల్ కాదు. అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు ఎందుకు అర్ధరాత్రి అరెస్టులు చేసి జర్నలిస్టులను, వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేశారు? బీఎన్ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు ఇస్తే సరిపోయేదానికి ఇంత దౌర్జన్యం ఎందుకు? ఈ ఘటన ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. తెలంగాణ డీజీపీ చట్టబద్ధమైన విధానాన్ని పాటించాలని, కాంగ్రెస్ పార్టీ, దాని అప్రామాణిక నాయకత్వం చేస్తున్న చెడు రాజకీయాలకు పాల్పడకుండా ఉండాలని నేను కోరుతున్నాను." అని కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో పేర్కొన్నారు. ఈ మొత్తం ఘటనలో అసలు లీక్ చేసిన వ్యక్తి ఎవరు? అని ప్రశ్నించారు.

ఇటీవల తెలంగాణ రాజకీయాల్లో మహిళా ఐఏఎస్ ఆఫీసర్ , మంత్రి పై వచ్చిన కథనాలు తీవ్ర దుమారం రేపాయి. ఐఏఎస్ అధికారిణి ప్రతిష్టకు భంగం కలిగించేలా ఈ కథనాలు రావడంపై కొన్ని న్యూస్ ఛానళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ పై కేసులు నమోదయ్యాయి. దీంతో ఎన్టీవీ యాజమాన్యం బహిరంగంగా క్షమాపణలు తెలిపింది. ఆ తర్వాత ఇన్ పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్లు పరిపూర్ణాచారి, సుధీర్ లను పోలీసులు శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల అరెస్టులను బీఆర్ఎస్ నేతలు, జర్నలిస్టుల సంఘాలు ఖండించాయి.

# ఇరాన్‌ను వెంటనే వీడండి.. భారతీయులకు కేంద్ర ప్రభుత్వం అత్యవసర హెచ్చరిక!

మొదటి పేజీ తరువాయి

అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలని, తమ పాస్‌పోర్టులు, ఇతర గుర్తింపు పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

దిదిలా ఉంటే ఇరాన్‌లో చెలరేగిన ఆందోళనలు అత్యంత హింసాత్మకంగా మారాయి. ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆందోళనల అణచివేతలో దాదాపు రెండు వేల మంది మరణించి ఉండవచ్చని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే కేవలం రెండు రోజుల్లోనే దాదాపు 12 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రముఖ మీడియా సంస్థ 'ఇరాన్ ఇంటర్నేషనల్' ప్రచురించిన కథనం సంచలనంగా మారింది. ఇరాన్ లో నెలకొన్న తాజా పరిస్థితులపై ఐక్య రాజ్య సమితి తీవ్రంగా స్పందించింది.

# రైలుపై కుప్పకూలిన భారీ క్రేన్.. ఏకంగా 22 మంది దుర్మరణం

నిర్మాణంలో ఉన్న భారీ క్రేన్ ట్రైన్‌పై కూలిన ఘటన థాయిలాండ్ లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బ్యాంకాక్‌కు ఈశాన్యంగా 230 కిలో మీటర్ల దూరంలో ఉన్న నఖోన్ రాట్చసిమా ప్రావిన్స్‌లోని సిఖియో జిల్లాలో బ్యాంకాక్ నుంచి ఉబోన్ రాట్చథానీకి 195 మంది ప్రయాణికులతో వెళ్తున్న రైలుపై.. చైనా సహకారంతో నిర్మిస్తున్న హై-స్పీడ్ రైలు ప్రాజెక్టుకు చెందిన భారీ క్రేన్ అకస్మాత్తుగా కూలింది.

ఈ దుర్ఘటనలో ఇప్పటి వరకు మొత్తం 22 మంది ప్రయాణికులు మృతిచెందగా, మరో 30 మందికిపైగా గాయపడినట్లుగా తెలుస్తోంది. క్రేన్ పడటంతో రైలు బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదం జరిగిన వెంటనే రైలులో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను వెలికితీసేందుకు స్థానిక పోలీసులు, రెస్క్యూ టీమ్స్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. మృతుల సంఖ్యను నఖోన్ రాట్చసిమా పోలీస్ చీఫ్ ధృవీకరించారు. ఈ ఘోర ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని థాయ్‌లాండ్ రవాణా మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## మారణహోమం.. భారీ విధ్వంసంలో పెరిగిన మృతుల సంఖ్య

ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలతో ఇరాన్‌లో మొదలైన ఆందోళనలు ఇప్పుడు దేశవ్యాప్తంగా భారీ హింసకు దారి తీశాయి. గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న ఈ నిరసనలను అణిచివేసే క్రమంలో ఇరాన్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలు తీవ్ర విమర్శలకు గురవుతున్నాయి.

అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న మానవ హక్కుల ఉద్యమకారుల వార్తా సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకు ఈ ఆందోళనల్లో కనీసం 2,571 మంది మృతి చెందినట్లు అంచనా వేస్తున్నారు. వీరిలో 2,403 మంది ఆందోళనకారులు, 147 మంది భద్రతా సిబ్బంది, ప్రభుత్వానికి చెందినవారు ఉన్నట్లు పేర్కొంది.

ఆందోళనలతో సంబంధం లేని వారు కూడా ఈ హింసలో బలయ్యారు. ఇప్పటివరకు 12 మంది చిన్నారులు, 9 మంది సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆ సంస్థ వెల్లడించింది. మరోవైపు, దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలకు సంబంధించి 18,000 మందికి పైగా ఆందోళనకారులను భద్రతా బలగాలు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఇరాన్ ప్రభుత్వం నిరసనలను అణిచివేసేందుకు ప్రత్యక్ష కాల్పులు, టియర్ గ్యాస్, భారీగా అరెస్టులు చేపడుతున్నట్లు మానవ హక్కుల సంస్థలు ఆరోపిస్తున్నాయి. పరిస్థితిని బయట ప్రపంచానికి తెలియకుండా అడ్డుకునేందుకు పలుమార్లు ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం కూడా జరిగిందని చెబుతున్నారు.

ఈ ఘటనలపై అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్ వంటి సంస్థలు ఇరాన్ ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ, పౌరులపై హింసను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తున్నాయి. అమెరికా సహా పలు దేశాలు కూడా ఇరాన్ పరిణామాలపై నిశితంగా గమనిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తే.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని మానవ హక్కుల సంస్థలు హెచ్చరిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో.. ఇరాన్ భవిష్యత్ రాజకీయ, సామాజిక పరిస్థితులపై అనిశ్చితి నెలకొంది.

# తెలంగాణ పల్లెలకు కేంద్రం తీపి కబురు! రూ. 2,500 కోట్ల నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి



ఇందులో భాగంగా ఈ నెలాఖరులోపు రూ. 1,000 కోట్లు, వచ్చే నెలలో మరో రూ. 1,500 కోట్లు విడుదల చేయనున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.

రాష్ట్రంలో 2024 జనవరిలో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. అప్పటి నుంచి ఎన్నికలు జరగకపోవడంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రావాల్సిన నిధులను కేంద్రం నిలిపివేసింది. అయితే గత నెలలో ప్రభుత్వం విజయవంతంగా ఎన్నికలు నిర్వహించడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ అధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్రానికి నివేదిక సమర్పించగా.. సానుకూలంగా స్పందించిన కేంద్రం నిధులను మంజూరు చేసింది. దీనికి తోడు సంక్రాంతి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతుగా రూ. 277 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవడానికి కేంద్రం కఠినమైన విధివిధానాలను నిర్దేశించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతి గ్రామ పంచాయతీ ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించి, దానిని పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ మరియు ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. నిధుల చెల్లింపుల కోసం సర్పంచి (చెకర్), ఉపసర్పంచి (మేకర్) కచ్చితంగా క్లాస్-3 డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు పొందాలి. వీటిని ఎంపీడీవోల ద్వారా ఆమోదించాల్సి ఉంటుంది. పనులన్నీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ లేదా టెండర్ విధానాల ద్వారానే నిర్వహించాలని, అవసరమైన రిజిస్ట్రేషన్లను జీఈఎం పోర్టల్‌లో పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించింది.

మరోవైపు.. గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి రూ. 277 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన కోరారు. నిధుల విడుదలపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేస్తూ ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో రాష్ట్రంలోని పల్లెలు పండగ వేళ కొత్త వెలుగులు సంతరించుకోనున్నాయి.

# వడ్డీల ఉరితాళ్ళకు తల్లి కొడుకుల బలి

పండుగ పూట ఓ ఇంట పెను విషాదం నెలకొంది. తల్లి కొడుకు ఆత్మహత్యకు యత్నించడంతో ఒక్కసారిగా ఆ గ్రామం ఉలిక్కిపడింది. ఈ హృదయ విదారక ఘటన బాపట్ల జిల్లా పరిధిలో వేటపాలెం మండలంలో ఉన్న శ్రీనివాసనగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సుజాత (55) కుటుంబంతో కలిసి చీరాల కొట్ల బజారులో నివసిస్తున్నారు. ఆమెకు కొడుకు సాయి (24) ఉన్నారు. కొంత కాలం క్రితం సుజాత భర్త అనారోగ్యంతో మరణించారు. దీంతో చీరాల రైల్వే స్టేషన్ వద్ద కొడుకుతో కలిసి టిఫిన్ బండి నిర్వహిస్తున్నారు. అయితే వ్యాపార నిర్వహణలో భాగంగా అప్పులు పెరిగిపోయాయి. బాకీలు చెల్లించాలని వడ్డీ వ్యాపారులు తల్లి కొడుకుపై ఒత్తిడి పెంచారు. ఆ ఒత్తిడిని తట్టుకోలేక మనోవేదనకు గురైన సుజాత, ఆమె కుమారుడు సాయి ఆత్మహత్యకు యత్నించారు. శరీరంపై చమురు వంటి ద్రవాన్ని చల్లుకొని నిప్పంటించుకున్నారు. దీంతో తల్లి, కొడుకు శరీర భాగాలు మంటలకు కాలిపోయాయి. గమనించి స్థానికులు వెంటనే వారి వద్దకు చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం విషమ పరిస్థితుల్లో తల్లి కొడుకును ఒంగోలులోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తల్లి పరిస్థితి విషమంగా ఉందని.. బాధితులిద్దరికి చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు.

# డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. 27 మందికి పైగా గాయాలు




పండుగ వేళ ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై అర్ధరాత్రి ప్రమాదానికి గురైంది. కొల్లాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్తుండగా, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న డీసీఎం లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బస్సు వెనుక నుంచి లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమై డ్రైవర్ స్టీరింగ్‌లో ఇరుక్కుపోగా.. 27 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు.

ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్సుల ద్వారా జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.బి. రత్నం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పండుగ వేళ కావడంతో బస్సులో మొత్తం 53 మంది ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారందరూ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రస్తుతం ఎవరికీ ప్రాణాపాయం లేదన్నారు. ప్రమాదానికి బస్సు డ్రైవర్ అజాగ్రత్తతో పాటు అతివేగమే కారణమని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.

# బేబీ ప్రొడక్ట్స్ రీకాల్... నెస్లేలో ఏం జరుగుతోంది?




ప్రముఖ ఆహారపదార్థాల కంపెనీ నెస్లే తాజాగా కొన్ని ప్రొడక్ట్స్ ను రీకాల్ చేయడం కలకలం రేపుతోంది. జనవరి 6న నెస్లే కొన్ని రకాల బేబీ ఫార్ములా పాల ప్రొడక్ట్స్‌ను గ్లోబల్ స్థాయిలో రీకాల్ చేసింది. అంతేకాదు తాము ప్రకటించిన ప్రొడక్ట్స్ ను కొనకూడదు, అమ్మకూడదు అంటూ నేడు మరో ప్రకటన జారీ చేసింది. ఇప్పటికే యూరప్‌తో పాటు ఆస్ట్రేలియా, కెనడాతో సహా మొత్తం 25 నుంచి 60 దేశాల్లో బేబీ ఫార్ములా మిల్క్ ప్రొడక్ట్స్ అమ్మకాలను ఉన్నపళంగా నిలిపివేసి, రీకాల్ చేపట్టారు. దీంతో అసలు నెస్లేలో ఏం జరుగుతుందో తెలియక ఆయా ప్రొడక్ట్స్ వాడుతున్న ప్రజలు ఆందోళన గందరగోళానికి గురవుతున్నారు.

ఇంతకీ ఏం జరిగింది?: బేబీ ఫార్ములాలో బ్యాసిలస్ సెరియస్ అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే సెరూలైడ్ టాక్సిన్ ఉండే అవకాశం ఉందన్న అనుమానంతో ఈ రీకాల్ చేశారని నిపుణులు చెబుతున్నారు. ఈ టాక్సిన్ వల్ల చిన్న పిల్లల్లో వాంతులు, విరేచనాలు, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు వస్తున్నట్టు కంపెనీ దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. రీకాల్ చేసిన బ్రాండ్లలో SMA, BEBA, NAN, Guigoz, Lactogen Harmony, Alfamino వంటి టాప్ మిల్క్ పౌడర్లు ఉన్నాయి. ఈ ప్రొడక్ట్స్ ను తక్షణమే వెనక్కి పంపాలని, వీటిని ఇప్పటికే వాడుతున్నవారు పక్కన పెట్టాలని నెస్లే విన్నవించింది.

భారత్ పై ఎఫెక్ట్ ఎంత?: భారత్‌లో ఇప్పటివరకు రీకాల్ సమాచారం లేకపోయినా.. గ్లోబల్ రీకాల్ కావడంతో FSSAI పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. భారత్‌లో ఈ ప్రొడక్ట్స్ వాడుతున్న తల్లిదండ్రులు బ్యాచ్ నంబర్, ఎక్స్‌పైరీ తేదీలను తప్పకుండా చెక్ చేయాలని సూచించింది. నెస్లే ప్రకటించిన బ్యాచ్ ఉంటే వెంటనే వాటిని వాడకుండా రిటర్న్ చేయాలి లేదా పారేయాలని పేర్కొంది. శిశువుల ఆరోగ్యం అత్యంత కీలకం కాబట్టి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
www.edikadanijam.com

# ఏకాదశి లక్ష పుష్పార్చన



ఇది కద నిజం, యాదాద్రి: లక్ష్మీనరసింహ స్వామి వారికి ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను వివిధ పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్య మనోహరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. సుగంధ పరిమళ పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమానుసారంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు పాల్గొన్నారు.

## లింగంపల్లిలో ఘనంగా సంక్రాంతి క్రీడా సంబరాలు

### ఐక్యతకు క్రీడలు ప్రతీక అన్న బిజెపి మండల అధ్యక్షుడు చంద్రకాంత్




ఇది కద నిజం, నవాబుపేట్ (లింగంపల్లి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నవాబుపేట్ మండలం లింగంపల్లి గ్రామంలో కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ, యువతలో నూతనోత్తేజాన్ని నింపేందుకు ఏర్పాటు చేసిన ఈ పోటీలకు గ్రామస్థుల నుండి విశేష స్పందన లభించింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి నవాబుపేట్ మండల అధ్యక్షులు ఎస్. చంద్రకాంత్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సమయాల్లో ఇటువంటి క్రీడలు నిర్వహించడం వల్ల గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉంటారని, పండుగ వాతావరణం మరింత రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, వ్యక్తుల మధ్య ఐక్యతను మరియు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామ ప్రజలందరూ, అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో ఉండాలని, ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామంలోని యువతను ఏకతాటిపైకి తెచ్చి ఇలాంటి ఆరోగ్యకరమైన పోటీలను నిర్వహించిన నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ క్రీడా వేడుకల్లో నాయకులు వి. పరమేష్, జి. మల్లేశం, జి. శ్రీశైలం, ఎస్. మల్లేశం, ఎస్. శంకరయ్య, ఎం. ఆంజనేయులు తదితరులతో పాటు గ్రామ యువత, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్ట్ మార్చిన వారిపై క్రిమినల్ చర్యలకు డిమాండ్

### మాజీ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, ఇది కద నిజం: కరీంనగర్ బల్దియా ఎన్నికలకు ముందే ప్రతిపక్ష పార్టీలు అధికారుల వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. ఓటర్ లిస్టులో వచ్చిన తప్పిదాలపై బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఓటర్ లిస్ట్ వ్యవహారంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఫిర్యాదు చేశారు. రాత్రికి రాత్రే ఓటర్ లిస్ట్ మార్చిన వారిని గుర్తించి క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్లు దక్కకుండా చేసిన కుట్రలో భాగంగానే ఓటర్ లిస్ట్ జాబితాను మార్చేశారని ఆరోపించారు.

బీఆర్ఎస్ పార్టీ అంటే కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు వణుకు పుడుతుందోన్నారు. తప్పుల తడకగా ఉన్న ఓటరు జాబితా పై రెండు పార్టీలు స్పందించకపోవడానికి కారణమేంటని గంగుట ప్రశ్నించారు. తన కుటుంబానికి చెందిన ఓటర్ల పేర్లు తాము నివిసిస్తున్న డివిజన్ తో సంబంధం లేని ప్రాంతంలో చేర్చారని ఈ వ్యవహారం వెనక ఎవరి హస్తం ఉందో తేల్చాలని గంగుల డిమాండ్ చేశారు. సాక్షాత్తు ఎమ్మెల్యే ఓట్ల విషయంలోనే ఇలా జరిగితే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటో ఆలోచించాలన్నారు.

ఓటర్ లిస్ట్ రూపొందించిన సమయంలో కంప్యూటర్ ఆపరేటర్ వద్ద ఎవరు ఉన్నారు...? జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు లేకుండానే మార్పులు ఎలా జరిగాయని అడిగారు. ఎన్నికల కమిషన్‌కు తెలియకుండా ఇంత పెద్ద ఎత్తున అవకతవకలు జరగడమేంటని ఈ విషయంపై అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండేందుకే ఓటర్ లిస్ట్‌ను తప్పుల తడకగా తయారు చేశారని గంగుల కమలాకర్ ఆరోపించారు. బుధవారం వరకు బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఓటరు జాబితాను సవరించాలన్నారు. లేనట్లయితే ఈ విషయంపై ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పొరేటర్లు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉద్యోగ అవకాశాలు సాధ్యం

# యాదగిరిగుట్ట సీఐ భాస్కర్

ఇది కద నిజం, వంగపల్లి: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం పొందడమే కాకుండా, శారీరక దృఢత్వం పెరిగి భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కూడా సాధించవచ్చని యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ అన్నారు. వంగపల్లి గ్రామంలో కేసరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైండ్ల సూర్యకాల రాములు స్మారక క్రికెట్ క్రీడోత్సవాల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు.



ఈ పోటీల్లో విజేతగా నిలిచిన యాదగిరిగుట్ట పోలీస్ జట్టుకు ప్రథమ బహుమతిగా కప్పుతో పాటు రూ.25,116 నగదు బహుమతిని అందజేశారు. ద్వితీయ బహుమతి సాధించిన కేసరి యూత్ జట్టుకు కప్పుతో పాటు రూ.15,116 నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి సర్పంచ్ శ్రీమతి వగ్గు రవళి, రానాప్రతాప్, ఉపసర్పంచ్ చిన్నం మల్లయ్య, కేసరి యూత్ అధ్యక్షుడు రేగు బాలనర్సయ్య, ఉపాధ్యక్షుడు పంపరి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి భూషిగణపల నాగేష్, ఎస్‌కే సయ్యద్, వార్డు సభ్యులు కానుగు రాజీవ్, కళ్ళే వినోద్ పాల్గొన్నారు. అలాగే కేసరి యూత్ సభ్యులు నరేష్, యాకరి అనిల్, కానుగు రాము, మహేష్, ప్రవీణ్, తాటిపాముల నరేష్, సాయి, నామిలే రఘు, కాంత్, సాయి ప్రకాష్, విక్కీ, విజయ్, మణి, భాస్కర్ తదితరులు హాజరయ్యారు.

## ముగిసిన పులుమామిడి పంచాయతీ క్రికెట్ టోర్నమెంట్

## బ్రూటల్ వారియర్స్ పై ఈగల్ టీం ఘనవిజయం



ఇది కద నిజం, పులుమామిడి: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం (14వ తేదీన) ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ఈ నెల 12వ తేదీన ప్రారంభమైన ఈ పోటీలు మూడు రోజుల పాటు క్రికెట్ ప్రేమికులను అలరించాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఈగల్ టీం మరియు బ్రూటల్ వారియర్స్ (Brutal Warriors) జట్లు తలపడగా, అద్భుత ప్రదర్శన చేసిన ఈగల్ టీం విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. టోర్నమెంట్ ముగింపు వేడుకలకు గ్రామ ఉప సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా, యువతలో క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయని కొనియాడారు. అనంతరం విజేతగా నిలిచిన ఈగల్ టీం సభ్యులకు ఉప సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన బ్రూటల్ వారియర్స్ జట్టును కూడా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, క్రీడాకారులు మరియు గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జై స్వరాజ్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ



ఇది కద నిజం: జై స్వరాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్ ను మార్కాపురం జిల్లా అధ్యక్షుడు కంచర్ల నాగేశ్వరరావు గౌడ్ ఈ రోజు జిల్లాలోని ఎర్రగొండ పాలెంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కోఆర్డినేటర్ లను నియమించామని, త్వరలో అన్ని మండలాల అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. జై స్వరాజ్ పార్టీ పట్ల జిల్లాలో రోజు రోజుకు ఆదరణ లభిస్తోందని, జిల్లాలో ప్రతి గ్రామానికి పార్టీని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ మార్కాపురం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పోలు భూదేవి, ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు

# భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి

ఇది కద నిజం: మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి మరియు మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి గారు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు కృషిని కొనసాగిస్తూ, ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుంటామని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.



# 16న తిరుమలలో శ్రీవారి పార్వేట ఉత్సవం.. ఆర్జితసేవలు రద్దు

ఏపీ న్యూస్, ఇది కద నిజం: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి పార్వేట ఉత్సవం సందర్భంగా కనుమ రోజున నిర్వహించే గోదా పరిణయోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జనవరి 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం , సహస్రదీపాలంకార సేవలను రద్దు చేసినట్లు వెల్లడించారు.

గోదా పరిణయోత్సవం సందర్భంగా ఉదయం 5.30 నుంచి 6.30 గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యర్‌స్వామి మఠం నుంచి ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకు వెళ్ళి స్వామివారికి సమర్పించడం జరుగుతుందని వివరించారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు మలయప్పస్వామి, కృష్ణస్వామి మూర్తులను పార్వేట మండపానికి తీసుకొచ్చి ఆస్థానం, పారువేట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# యూనైటెడ్ పీపుల్స్ పార్టీకి 'హాకీ స్టిక్ అండ్ బాల్ల' గుర్తు కేటాయింపు

- ప్రజలకు నిజాయితీతో కూడిన పాలన అందించడమే పార్టీ లక్ష్యం: భగిందర్ సింగ్
- పౌరులపై అనవసర పన్ను భారాన్ని తగ్గించి, పన్ను ఫ్రెండ్లీ నగరంగా మారుస్తామని హామీ.
- నీరు, రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రాథమిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.
- నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయం.
- ఎన్నికల్లో హాకీ స్టిక్ అండ్ బాల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలకు విన్నపం.



ఇది కద నిజం, హైదరాబాద్: రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) ఎన్నికల నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం యూనైటెడ్ పీపుల్స్ పార్టీ (UPP) కి 'హాకీ స్టిక్ అండ్ బాల్ల గుర్తును అధికారికంగా కేటాయించింది. ఈ కేటాయింపు పట్ల పార్టీ హర్షం వ్యక్తం చేస్తూ, హైదరాబాద్ నగర అభివృద్ధికి ఇది ఒక కీలక మైలురాయి అని పేర్కొంది.

ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు సర్దార్ భగిందర్ సింగ్ మాట్లాడుతూ.. నిబద్ధత, పారదర్శకత మరియు నిజాయితీతో కూడిన పాలనను అందించడమే తమ పార్టీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పౌరులపై అనవసరమైన పన్నుల భారాన్ని తగ్గించి, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ఒక ఆదర్శవంతమైన, పరిశుభ్రమైన మరియు పన్ను రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లందరూ తమ విలువైన ఓటును 'హాకీ స్టిక్ అండ్ బాల్ల గుర్తుకు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక వసతులైన మంచినీటి సరఫరా, రోడ్లు, వీధి దీపాలు మరియు వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను మెరుగుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# పామిరెడ్డిపల్లి లో ఘనంగా ముగ్గుల పోటీలు




వనపర్తి : పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో మకర సంక్రాంతి పండుగ శుభ సందర్భంగా గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీల్లో విశేష స్పందనతో మహిళలు పాల్గొన్నారు.ఈ ముగ్గుల పోటీల్లో మొత్తం మహిళాలు 64 మంది మహిళలు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం వారి చేతుల మీదుగా మొదటి బహుమతి స్పందన, రెండవ బహుమతి చిన్నారి,మూడవ బహుమతి పావని, గెలుపొందారు వారికి బహుమతులు అందజేశారు. బహుమతులకు దాతలుగా గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం, చిట్యాల సుదర్శన్ రెడ్డి, పానుగంటి రాములమ్మ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ స్థానిక నాయకులు వార్డు మెంబర్లు పద్మ, కృష్ణ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు కొంటమోనియాదగిరి, రఘుగౌడ్,దత్తాత్రేయ రెడ్డి,లక్ష్మణ్ గౌడ్,మహిళలు, యువకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఆస్టార్ హీరోతో గడిపిన సమయం

## ఎంతో ప్రత్యేకం



నిధి అగర్వాల్ ప్రస్తుతం వరుస విజయాలతో టాలీవుడ్‌లో దూసుకుపోతోంది. బ్యాక్ టు బ్యాక్ భారీ బడ్జెట్ చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును మరింత బలపరుచుకుంటోంది. గ్లామర్‌తో పాటు నటనకూ సమాన ప్రాధాన్యత ఇస్తూ, కమర్షియల్ సినిమాల్లోనూ తన పాత్రలకు ప్రత్యేకత తీసుకొస్తోంది. ఇటీవల 'హరి హర వీరమల్లు', 'ది రాజాసాబ్' వంటి క్రేజీ ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాల్లో ఆమె లుక్స్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకోగా, స్టార్ హీరోల సరసన నిలబడి తనకంటూ స్పేస్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా భారీ బడ్జెట్ చిత్రాల్లో భాగమవడం వల్ల ఆమె పాపులారిటీ దేశవ్యాప్తంగా మరింత పెరుగుతోందని చెప్పొచ్చు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిధి అగర్వాల్ ప్రభాస్‌పై ఆసక్తికర కామెంట్స్ చేసింది.

ప్రభాస్ నిజంగా చాలా చాలా మంచోడుడ బంగారం లాంటి మనిషి అని ఆమె భావోద్వేగంగా చెప్పారు. సెట్స్‌లో ఆయనతో గడిపే సమయం తనకు ఎంతో ప్రత్యేకమని, షూటింగ్ గ్యాప్‌లలో సినిమాల గురించి మాత్రమే కాకుండా లైఫ్, క్రియేటివిటీ, మనసుకు ప్రశాంతత ఎలా దక్కాలనే విషయాలపై కూడా ప్రభాస్ మాట్లాడతారని తెలిపారు. ఆయన మాటల్లో ఎలాంటి ఆర్భాటం ఉండదని, చాలా సింపుల్‌గా కానీ లోతైన ఆలోచనలతో ఉంటారని చెప్పారు. ప్రభాస్ అసలు సోషల్ మీడియాకే దూరంగా ఉంటారని, అదే తనకు పెద్ద ఇన్స్పిరేషన్‌గా మారిందని ఆమె వెల్లడించారు. ఫోన్‌కి, సోషల్ మీడియాకు మనం ఎంతగా అలవాటు పడిపోయామో అప్పుడు అర్థమైందని, నిజంగా క్రియేటివ్‌గా ఉండాలంటే కొన్నిసార్లు సోషల్ మీడియాకు దూరంగా ఉండాల్సిందేనని ఆయన దగ్గర నుంచి నేర్చుకున్నానని చెప్పారు. ప్రభాస్ వల్ల తానూ ట్విట్టర్‌ను ఫోన్ నుంచి డిలీట్ చేయాలనుకుంటున్నానని, మనసుకు నిశ్శబ్దం దొరికితే పనిలో ఇంకా మెరుగైన ఫలితం వస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రభాస్ లాంటి స్టార్ అయినా కూడా అంత సింపుల్‌గా ఉండటం తనకు ఎంతో ప్రేరణనిస్తుందని, ఆయన్ను చూసి మనిషిగా ఎలా ఉండాలో నేర్చుకుంటున్నానని ఆమె చెప్పడం చర్చకు దారితీస్తోంది.

---

# రూ.4 కోట్ల నుంచి 18 కోట్లకు

## ఆ ఒక్క హిట్ నయనతార కెరీర్‌నే మార్చేసింది!

సౌత్ ఇండస్ట్రీలో హయ్యెస్ట్ రెమ్యునరేషన్ తీసుకునే హీరోయిన్లలో సీనియర్ కథానాయిక నయనతార ఒకరు. సినిమా ప్రమోషన్స్ చేయకపోయినా, ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు డుమ్మా కొట్టినా.. అమ్మడు అడిగినంత తప్పక ఇవ్వాల్సిందే. నయన్ గ్లామర్, నటన సినిమాకు అదనపు బలం కాబట్టి నిర్మాతలు భారీ మొత్తం చెల్లించుకోక తప్పట్లేదు. బాలీవుడ్ వెళ్లడానికి ముందు నయన్ రూ.4-6 కోట్లు ఛార్జ్ చేసేవారు. 'జవాన్' హిట్ పడ్డాక ఆమె క్రేజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. జవాన్ కోసం రూ.10 కోట్లు తీసుకున్న నయన్.. సౌత్‌లో కూడా రెమ్యునరేషన్‌ను భారీగా పెంచేశారు.

లేడీ సూపర్ స్టార్ నయనతార తాజాగా వచ్చిన 'మన శంకర్ వరప్రసాద్ గారు'లో నటించారు. ఈ సినిమా కోసం రూ.18 కోట్లు అడిగారట. ఒక్కసారిగా అవాక్కయిన డైరెక్టర్ అనిల్ రావిపూడి.. నయన్‌ను కన్విన్స్ చేసి తక్కువ పేమెంట్‌కే ఫిక్స్ చేశారని టాక్. పేమెంట్ తక్కువ చేయడమే కాదు.. నయనతారతో అనిల్ ప్రమోషన్స్ కూడా చేయించారు. ఇది గొప్ప విషయమే అనే చెప్పాలి. ఎందుకంటే.. నయన్ ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటారన్న విషయం తెలిసిందే. అయితే ప్రీ రిలీజ్ ఈవెంట్ నుంచి ఎస్కేప్ అయ్యారు. తాను నయన్‌ను ఒప్పించేందుకు స్వయంగా రంగంలోకి దిగనని అనిల్ రావిపూడి చెప్పిన విషయం తెలిసిందే.

మన శంకర్ వరప్రసాద్ గారు కన్న ముందే నయనతార మొదలు పెట్టిన మూకుత్తి అమ్మన్ 2కి మాత్రం రూ.12 కోట్లు ఛార్జ్ చేస్తుందని సమాచారం. ఈ సినిమాను వంద కోట్లతో తెరకెక్కిస్తున్నాయి నాలుగు ప్రొడక్షన్ హౌసెస్. మాలీవుడ్ చిత్రాలకు రూ.10-12 కోట్ల లోపు ఛార్జ్ చేస్తున్న నయన్.. పాన్ ఇండియా సినిమాలంటే మాత్రం రెమ్యునరేషన్ విషయంలో తగ్గేదేలే అంటున్నారు. కేజీఎఫ్ హీరో యశ్ అప్ కమింగ్ ఫిల్మ్ 'టాక్సిక్'లో నయన్ నటిస్తున్నారు. గంగ పాత్రలో అటు గ్లామర్.. ఇటు యాక్షన్ అవతార్‌లో నటిస్తున్న లేడీ సూపర్ స్టార్.. ఈ క్యారెక్టర్ కోసం రూ.18 కోట్లు అడిగారట. ఈ సినిమాకున్న డెప్త్, ఆ క్యారెక్టర్‌కు ఉన్న ఇంటెన్సిటీని దృష్టిలో పెట్టుకుని రూ.15 కోట్లకు టీం ఫైనల్ చేసిందన్నది లేటెస్ట్ టాక్. మొత్తానికి క్రేజ్ ఉన్నప్పుడే డిమాండ్ చేయాలన్న కాన్సెప్ట్ పెట్టుకున్నట్లున్నట్లు ఉన్నారు నయన్.



---

## కోలీవుడ్ డైరెక్టర్‌తో

# అల్లు అర్జున్ భారీ ప్రాజెక్ట్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో సినిమా ఖరారైంది. ఈ విషయాన్ని మూవీ మేకర్స్ ఓ వీడియో ద్వారా వెల్లడించారు. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మిస్తుండగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా అనిరుధ్ రవిచందర్ పని చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జులైలో ప్రారంభమై, అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ప్రస్తుతం AA-23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీ, భారతీయ సినీ చరిత్రలో గుర్తుండిపోయే కాంబినేషన్‌లో రాబోతుందని మేకర్స్ తెలిపారు. అంతేకాదు, "గొప్పగా మారేందుకు కృషి చేయు" అనే క్యాప్షన్‌తో విడుదలైన వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో అల్లు అర్జున్ సరసన దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటించనున్నట్లు టాక్. ఈ ప్రాజెక్ట్ సైన్స్ ఫిక్షన్ నేపథ్యంతో, హై యాక్షన్ ఎపిసోడ్స్, హాలీవుడ్ స్థాయి వీఎఫ్ఎక్స్ తో పాటు ఫ్రెష్ నరేటివ్‌తో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్నట్లు టాక్. ఇక ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.